# పొగ(రు) మంచు

-డా॥ కేతు బుచ్చిరెడ్డి

అది పల్లెటూరూ కాదు, పట్నమూ కాదు. మధ్యస్థంగా ఉన్న మండల కేంద్రం. పేరు మామండూరు. బాలికా కాని, ప్రౌఢ కాని, కుమారి అయినట్లు. దూడకాదు, ఈతల ఎనుము కాదు, పడ్డదూడ అయినట్లు, బావి కాదు, చెరువూ కాదు, కోనేరు మాదిరి, పిందెకాదు, పండు కాదు, దోరకాయ అన్నట్లు- ఉంటుంది మామం దూరు. పల్లె వాతావరణం ఉంది, పట్టణ నాగరికత ఉంది. గ్రామ లక్షణాలు, పట్టణ హంగులు అన్నీ ఉన్నాయి. ఎడ్లబండ్లు, పశువులు కనిపిస్తాయి. జీపులు, కార్లు కూడా కనిపిస్తాయి. ఫోనులు, కాసెట్ పాటలు వినిపిస్తాయి. ఊర్లో టెంటు సినిమా ఉంది. కొన్ని ఇళ్లలో టి.వి., వి.సి.ఆర్.లున్నాయి. పంచెలు కనిపిస్తాయి, పాంట్లూ కనిపిస్తాయి. ముతక నేత చీరలు, మిల్లు పంచెలు కనిపిస్తాయి. అలాగే నైటీలు నడుస్తుంటాయి. జిల్లా కేంద్రం నుండి కొన్ని బస్సులు మామండూరుకు మనుష్యుల్ని, సామాన్లనే కాక నాగరికతను సైతం మోసుకొచ్చి, ఇచ్చి, పలుకరించి పోతుంటాయి. చుట్టు పట్ల గ్రామాలకు వెళ్లే బస్సులు కూడా మామండూరును తాకి వెళ్తుంటాయి.

మామండూరులో ఓ వీధి చివర మట్టిమిద్దె. ముం దర చీనా రేకుల వసారా. అందులో కాపురముంటు న్నారు మోహన్, నాగమణి. పెళ్లయి పదేళ్లయినా నాగమణి కడుపున ఒక కాయ కూడా కాయలేదు. అందుకు వాళ్లిద్దరికీ ఏ బాధా లేదు. బాధ కలగకపోవ డానికి ఇద్దరికీ ఎవరి కారణాలు వారికున్నాయి. మోహన్‌కు ఉద్యోగం చెయ్యడానికి సరిపడే చదువులేదు. అట్లని ఏమీ చదవక కూలీనాలీ చేసుకునే బాపతుకు సంబంధించిన వాడు కూడా కాదు. హైస్కూలు చదు వుతో ఆపేసినందున వంగి వ్యవసాయం చేయలేదు. చేయించడానికి పెద్దలు సంపాదించిన ఎకరాల కొద్దీ భూములు లేవు. ఉన్నది ఒక ఎకరా. అదీ కోరుకో, గుత్తకో ఇచ్చేవాడు. కానీ అది కూడా ఇప్పుడు తాకట్టులో ఉంది.

మట్టి మిద్దె తాకట్టులో ఉంది.

తాళికట్టిన నాగమణి తాళి తాకట్టులో ఉంది.

పుట్టింటి వాళ్లు పెట్టిన చిన్నమెత్తు బంగారం కూడా మిగలకుండా ముక్కులో, చెవుల్లో, వేలిలో ఉన్నవన్నీ ఒక్కొక్కటే, "కాకి ఎత్తుకుపోయినట్లు" తాకట్టులోకి వెళ్లి పోయాయి. కాళ్లలో, కాలి వేళ్లలో వెండి గజ్జెలు, మెట్టెలు కాళ్లొచ్చి నడిచి వెళ్లి తాకట్టు తక్కెట్లోకి పోయి కూచున్నాయి.

మోహన్ చేతి గడియారం తాకట్టు వడ్డీ వ్యాపారి సుబ్బయ్య ఇంట్లో టైం చెప్పడానికి వెళ్లింది. మోహన్ చేతి వేళ్లకున్న బంగారు ఉంగరాలు బరువుగా ఉన్నా యని, పరువు దక్కుతుందని తాకట్టుకు పంపి, చేతి వేళ్లని తేలిక చేసుకుని, చేతులు దులుపుకున్నాడు.

నాగమణి కష్టపడి పెంచిన కోళ్లు, మేకలు, ఇంట్లో అవి గలీజు చేస్తున్నాయని, ఇంట్లో నీట్‌గా, ఏమి అడ్డం లేకుండా ఉండాలని మోహన్ అనుకుంటున్నాడని, అతను చేసిన అప్పు తీర్చడానికి, తమ ఋణం తీర్చుకోవ డానికి, ఆ మూగజీవులు తాకట్టుకు వెళ్లాయి.

అట్లాగని ఆలుమగలు హాయిగా కాలుమీద కాలు వేసుకొని, అప్పుచేసి పప్పుకూడు కూడా తినటంలేదు.

అక్కా చెల్లెళ్లు లేదా తల్లిదండ్రుల బరువు బాధ్యతలు తీర్చడానికి కూడా అప్పులు చేయటంలేదు.

నాగమణి రెక్కలు ముక్కలు చేసుకొని రోజూ ఐదు, పది రూపాయలు సంపాదిస్తుంది.

ఉదయం అనగా లేచి ఇల్లు విడిచి, బయటపడితే మోహన్‌కు సంపాదన మీదే ధ్యాస! ఏ అర్ధరాత్రికో ఇల్లు చేరేది. ఉన్న ఊర్లో, చుట్టుప్రక్కల పల్లెలకు కూడా వెళ్తాడు. ఎలక్ట్రీషియన్‌గా, మోటార్ మెకానిక్‌గా రెండు విద్యలతో, రెండు చేతులా సంపాదించాలని ఆశే! కాళ్ల బదులు అవీ చేతులై సంపాయించి వుంటే బాగుండు ననుకుంటాడు.

అయినా మోహన్ అప్పు చేస్తూనే ఉన్నాడు. అప్పు పుట్టిన చోటంతా అప్పు చేస్తున్నాడు. వడ్డీలకు, తాకట్లు పెట్టి.

## మినీ

మినిమమ్ / వాక్య ఐక్యతతో
మేగ్జిమమ్ / ఒత్తిడి తెచ్చేదే
మినీ కవిత!

-గుడిమెట్ల గోపాలకృష్ణ

"అప్పు చేయనివాడు
తప్పు చేయనివాడు
ఉప్పు తిననివాడు
ఇప్పుడు భూమిమీద ఎవడు లేడు"-

అని మోహన్ అపుడపుడు చెప్తుంటాడు, "ఎందు కయ్యా ఇట్లా అప్పుల పాలవుతావు?" అన్నవాళ్లకి.

"రుణ బాధ, వ్రణ బాధ, యమ బాధ ఒకటే నాయనా" అనే పెద్దవాళ్ల హితబోధ మోహన్ ఎపుడూ ఎడమ చెవిక్కూడా ఎక్కించుకోలేదు!

❍ ❍ ❍

నాగమణి అపుడే వయోజన విద్యా కేంద్రం నుండి వచ్చింది. లాంతరు వొత్తి పెద్దది చేసి, తెలుగు వాచకం చదవడానికి కూచుంది. అందులోని కథలు ఎన్నోసార్లు చదివింది. వాటిని మళ్లీ మళ్లీ చదవాలనిపించేది. అవి చదువుతుంటే తనలోకి కొత్త శక్తి, వెలుగు వచ్చినట్లని పించేది.

కొంత కాలంగా బిల్లు కట్టనందున కరెంట్ డిపార్టు మెంటు వాళ్లు కనెక్షన్ పీకేశారు. ఎలక్ట్రీషియన్ ఇంట్లోనో ఎలక్ట్రిసిటీ వెలుగు లేదు.

తన తలకు చమురు లేకపోయినా, లాంతరుకు మాత్రం కిరసనాయిలు కొదవ చేయలేదు నాగమణి.

ఇంకా మోహన్ రాలేదు.

ఫ్రేము ముందర పెట్టుకొని, అగ్గిపుల్లలు పేర్చటం మొదలుపెట్టింది. అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ పిల్లలు వచ్చి, పేర్చిన ఫ్రేములు తీసుకెళ్లి, ఖాళీ ఫ్రేములు ఇచ్చి వెళ్తారు. ఫ్యాక్టరీ యజమాని లెఖ్ఖగట్టి, డబ్బు పంపిస్తుం టాడు. పుల్లలన్నీ ఖచ్చితంగా, అందంగా ఫ్రేములో ఒదిగిపోతున్నాయి. మందు పెట్టిన పుల్లల్తో అగ్గిపెట్టెలు ముచ్చటగా, అన్నీ ఒకేరకంగా, లేబిల్స్‌తో ముస్తాబై ఒక ప్రక్కన ఉన్నాయి. నాగమణి ఆలోచిస్తోంది. తన ఆలోచనలే గందరగోళంగా ఉన్నాయి. ఒక కొలిక్కి రాకుండా ఉన్నాయి. అన్నీ, అంతా, ఖచ్చితంగా అం దంగా ఉండటానికి మనిషి అచ్చుకాదు, యంత్రమూ కాదు. తనని గురించి, తన భర్తను గురించి, పుట్టింటి గురించి ఆలోచిస్తోంది.

తలుపు దబదబ తట్టిన శబ్దం- కాదు కొట్టిన శబ్దం.

ఫ్రేము పక్కనపెట్టి, వెళ్లి తలుపు తీసింది. వచ్చిం దెవరో తనకు తెలుసు. వచ్చిన మనిషి ఎట్లా, ఏ స్థితిలో ఉంటాడో కూడా తెలుసు.

ఆ వచ్చినతను నాగమణి మొగుడు మోహన్. ఆమె పాలిటి యముడు.

గుప్పున సారా వాసన. పాంటు, షర్టు నలిగి మాసి ఉన్నాయి. తల గద్ద గూడులా ఉంది. తలలో ఆలోచ నలు పొంత గద్దలా ఉన్నాయి. తడబడుతూ, తూలుతూ ఇంట్లో అడుగుపెట్టాడు.

భర్తకు తిండి పెట్టింది నాగమణి. తాగిన అందరు మొగుళ్లలా, "కోడికూర ఏదే! చేపల పులుసు యాడే?" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. అన్నం ప్లేటు ప్రక్కకు పారేశాడు. పోయి, కుక్కి నులక మంచం మీద బొక్కబోర్లా పడుకున్నాడు.

– ఏ అర్ధరాత్రో తలుపు తట్టడం, "అది లేదు, ఇది లేదు" అని వీపు బద్దలు కొట్టడం, ఐదో, పదో దాచిపెట్టింది దోచుకోవడం, తిట్టడం, అందినవన్నీ తాకట్టు పెట్టడం–

నాగమణికి ఇవేమీ కొత్తకాదు!

కాసేపటికి నాగమణిని, "ఏయ్! ఈటికి రా!" అన్నాడు మోహన్. దగ్గరికి వచ్చిన ఆమెని మంచం మీదకు లాక్కున్నాడు. ఆమె "శవమై, అతని వశమై, అతనికి సుఖమై, అతడు పశువై"– ఆ రాత్రి, ఎన్నో రాత్రుళ్ళూ గడిచిపోయింది.

దాంపత్యంలో ఇద్దరి శరీరాలతో పాటు మనసులు కలిసినపుడే ఆనందం. లేకుంటే నరకం. అప్పుడు ప్రపంచంలో అంతకంటే అసహ్యమైన, బాధాకరమైన పని ఇంకొకటి ఉండదు. అది వ్యభిచారం కన్నా హీనం!!

జూదం, తాగుడు రెండింటిని మానమని నాగమణి ఎన్నోసార్లు మోహన్‌కు నచ్చచెప్పింది. బ్రతిమాలింది. మొత్తుకుంది. బెదిరించింది. అలిగింది. పెద్దలంటే గౌరవం, భయంలేదు. పెళ్లి చేస్తే బాగుపడితే కళ్లారా చూడాలనుకున్న తల్లితండ్రులు, అతని ఆగడాలు చూడలేక శాశ్వతంగా కన్నుమూశారు.

పుట్టింటికి వెళ్తాననో, ఉరిపోసుకుంటాననో భార్య బెదిరిస్తే "ఆ పప్పులు నా దగ్గర ఉడకవు" అన్నట్లు చూసేవాడు. ఓపిక వుంటే బాదేవాడు. ఆమె ఎన్నోసార్లు ఏడ్చింది. ఏడ్చిన ప్రతిసారి కన్నీళ్లు ధారలయ్యాయి.

ఇప్పుడు ఆమె కళ్లు ఎండిపోయాయి– అనంత పురం చెరువులు, బావుల్లా.

"నీవు ఎంత ఏడ్చి మొత్తుకున్నా, మేము కన్నీళ్లు కురవము" అని ఆమె కళ్లు నిర్మొహమాటంగా చెప్పే శాయి. అనంతపురం మీదుగా పోయే చెవిటి, మూగ నిర్దయ మేఘాల్లా!

ఆమె ఏడుస్తూనే వుంది– కానీ కన్నీళ్లు రావటం

లేదు.

ఆమె బాధపడుతోంది- మనసులో మాత్రం కన్నీళ్లు ఏరులై పారుతున్నాయి.

○ ○ ○

ఎన్నోసార్లు పుట్టింటికి వెళ్లి తన పరిస్థితి చెప్పి, ఆదుకొమ్మంది. ఆధారం కమ్మని వేడుకొంది. మామం దూరుకు ప్రక్కనున్న వెంకటాంపల్లె ఆమె పుట్టిన ఊరు. భర్త ఇంటి నుండి బయటపడగానే, నాగమణి కాలి నడకన బయల్దేరింది అమ్మ దగ్గరికి.

నాగమణిని చూడగానే అమ్మ తల వంచుకొంది. అన్న తల పక్కకు తిప్పుకున్నాడు. వదిన మూతి విరి చింది. అయినా ఆఖరి ప్రయత్నంగా అడిగింది- "నా పరిస్థితి ఏం బాగాలేదు. ఆయనకు తాగటం, పేకాటాడటం తప్ప వేరే లోకం లేదు. తను సంపాదిం చింది, నేను కూడబెట్టింది ఆయన అలవాట్లకు చాలక, ఊరినిండా వడ్డీలకు అప్పులు చేసి, అందినవన్నీ తాకట్టు పెట్టాడు. రోజురోజుకు పరిస్థితి దిగజారిపోతోంది. గంజికి కూడా గడవని.. మేము ఏమైపోతామో.. మీరే ఎట్లయినా.." మాటలు రావడంలేదు. గొంతు నిండా గుండె అడ్డం పడింది.

ఏడుస్తోంది. కానీ కన్నీరు రావటం లేదు. ఎంత దౌర్భాగ్యం!

విధవ తల్లి తన నిస్సహాయతను తెలిపింది- "మొగుడు ఎసుమంటోడయినా, ఆడదానికి ఆడే సొర్గ మైనా, నరకమైనా, పున్నెంకొందీ పురుసుడు, పెండ్లి సేసే దాంకే మా పని- మీ నాయన ఉన్నెపుడు అంతో ఇంతో మా శగితి కొందీ నువు సుకపడతావని, పల్లె నుండి పట్నం ఇస్తిమి. నీ అదురుట్టం అట్టాగుంది. మేం ఏం సేత్తాం?" అన్నది అమ్మ.

"ఆలు మగల మద్దెన వేరేవాల్లు ఏల్లు పెట్టగూడదు. ఎవురి సంసారం ఆల్లే సక్కబెట్టుకోవాల్ల. లాకపోతే నిన్నే సేతకాని ఆడదానివని అంటారంతా. పుట్టింకి ఆడబిడ్డ ఒక్కర్తే వత్తే, "మొగుడ్నిడిసింద"ని అందరూ అంటారు. మేం ఊల్లో తలెత్తుకు తిర్గగలమా?" అని చేతులెత్తేశాడు అన్న. ఒకే కడుపున పుట్టిన అన్న, వదిన చాటు అన్న.

"ఆదుకోడానికి, చేదుకోడానికి మాకు మడులు, మాన్నాలు లేవు" లోపల్నుండే, కడుపులో వుండే మాట అంది వదిన.

"ఒక్క పూటన్నా ఉండు, ఇంత తినిపో" అని కూడా అన్న అనలేదు. అన్న గొంతులో వదిన గాది అడ్డు

## బతికే వుంది

పుస్తకం చనిపోలేదు
అదలా వుంది / అలా వుంచి
చనిపోయిందంటున్నావు / దాని మీద పేరుకున్న
దుమ్మూ ధూళీ / అంచుల్లో నల్లజీరలూ సరే
లోపలేముంది
ఎపుడన్నా తెరిచావా
తెరుద్దామనుకునేలోపు
ఏదో పిలుపు ఏదో పరుగు
ఏదో తీరికలేని వ్యాపకం
తెరవనే లేదు / కొన్నాళ్ళకు
తెరవాలనీ అన్పించి వుండదు
తెర ఒకటి నీ ముందు వాలి
అబద్ధాల్ని అద్భుతంగా రంగు రంగుల్లో
కళ్ళముందు వొంపుతూ వుంటే
నువ్వు వెయ్యిన్నొక్క హొయల్లు పోయి
మెలమెల్లగా వాటిల్లో కల్సిపోయి
కాలాన్ని దాటి దాటీ / ఇక కాలం మిగలక...
ఇపుడేమో / చుట్టూ మీటలూ
సెల్లూ నెట్‌లూ / ఛాట్‌లూ మీట్‌లూ...
ఇక తీరికేది
పుస్తకం / చనిపోయిందన్నావు
మిత్రమా / పుస్తకం నిశ్శబ్దంగా వుంది
శబ్దాల్ని లోన పొదుగుకుని / ఒక తాత్వికుడిలా!
తీరైన ఊహల్నీ
అలలై లేచే ఆలోచనల్నీ
కూర్చుకుని సంపద్వంతమై
నిరీక్షిస్తూ వుంది
ఇవ్వడానికి సిద్ధమై!
మనిషి చరిత్ర / మరణించొద్దని
వేయి ప్రార్థనలు చేస్తూ / పుస్తకం బతికే వుంది
కాస్త పరుగాపి / రా!
దీన్ని తెరిచి చూడు / అద్దమో ఆకాశమో
చిన్న నీటి పాయో
మెత్తగా తాకే చల్లని చేయో
రెండు సూర్యకిరణాల్లో
నీకు దక్కు మిత్రమా!
అలస్యమెందుకు / రా! తెరవడాన్కి!

-దర్భశయనం శ్రీనివాసాచార్య

## చిరంజీవ చిరంజీవ

మన భాష మనకి / పరాయిదెట్లా అవుతుందీ?
అవుతుంది! / మన మధ్య వుంచి పెంచాల్సిన
మన పిల్లాడ్ని / ఎక్కడో హాస్టల్‌లో చేర్పించి
నెల నెలా ఆర్థిక సంబంధం మాత్రమే కొనసాగిస్తూ
ఎప్పుడో చుట్టాల్లా వెళ్ళి చూసొస్తే
మన పిల్లాడు పరాయి వాడైనట్టు
పరభాషా మోజుల జాజుల దండలు
మెడను అలంకరించుకుంటున్న ఈ తరానికి
ముద్దబంతుల సౌందర్యం గురించి వివరించి
విశదీకరించకపోతే / వారసత్వపు సంపదలా
ఒక తరం నుండి/మరో తరంకి సంక్రమించాల్సిన
మన మాతృభాష / పరాయిదే అయిపోతుంది
అఖండ దీపంలా వెలుగుతున్న తెలుగు
గర్వంగా జెండాలా ఎగురుతున్న తెలుగు
పురివిప్పిన నెమలిలాంటి తెలుగు
పూవులాంటి తెలుగు / చిరంజీవ సుఖీభవ అని
ఎందరో పెద్దల, శ్రేష్ఠుల
ఆశీర్వాదాలందుకున్న తెలుగు
ఇన్నాళ్ళూ స్థిరంగా నిలబడిన తెలుగు
ఇక పట్టు తప్పిపోనుందా
తెల్లారిపోనుందా/ఏ రాటకైనా సులువుగా లతలా
అల్లుకుపోగలిగే తెలుగుకు /రాటలే కరువవుతుంటే
ఇక దాని మనుగడకీ, ఉనికికీ/పూచీపడేదెవరు?
అఖండ దీపం మలిగిపోకుండా
మనమే చేతులడ్డం పెడదాం
అది- నిరంతరం వెలగడానికి
మనమంతు చమురు పోద్దాం.
పోషణలేని శరీరంలా/పోషకాలు లేని ఆహారంలా
శత్రువు దాడికి గురవుతున్న శిబిరంలా
వెలిసిపోనున్న గోడలా
తెలుగుకేవిటయ్యా ఈ దుస్థితి.
తెలుగు ప్రాంతం నుండి
ఆంధ్ర భాషను వేరుచెయ్యాలనో
ఆంధ్ర ప్రాంతం నుండి
కోటిరత్నాల వీణను సాగనంపాలనో
నీచ, నికృష్ట తలంపు మానేసి
రాజేస్తున్న కుంపట్లను ఆర్పేసి
తెలుగును తెల్లారనివ్వకుండా చూద్దాం
తెలుగులందరం/తెలుగులోనే పలుకరించుకుందాం
మన గూట్లో / తెలుగులోనే పలవరించుకుందాం
తెలుగువస్త్రానికి/చిరుగు చిగురు వెయ్యకుండా చూద్దాం

-మాధవీ సనారా

పడింది.

అమ్మ బంగపోతున్నా, బువ్వయినా తినకుండా, ఎండన పడి, కాళ్లీడ్చుకుంటూ, మామండూరు వచ్చి, ఇంటికి చేరింది నాగమణి.

○ ○ ○

పొద్దు వాటారుతోంది అంటే, మోహన్ మెదడులో "జూదం – తాగుడు", రెండు భూతాలు ప్రవేశించడానికి సమయం ఆసన్నమైందని అర్థం. పెళ్లాన్ని అడిగాడు డబ్బు కోసం. ఆమె చేతులు వెల్లకిలా తిప్పింది. గూట్లో, ముంతలో, డబ్బాల్లో, డబ్బు కోసం వెదికాడు. లాభం లేకపోయింది. "పొట్టి గొడ్డును పాలు పితికినట్లయింది" అనుకున్నాడు పెళ్లాం గూర్చి. ఇంటి నుండి బయట పడ్డాడు అప్పుకోసం.

"సుబ్బయ్యన్నా" పిలిచాడు మోహన్.

ఆ గొంతు, ఆకారం పరిచయమే సుబ్బయ్యకు.

"నూర్రూపాయలు అప్పు..." అడిగాడు మోహన్.

"మరి, తాకట్టు" అన్నారు సుబ్బయ్య.

"ఉన్నవన్నీ నీకే పెట్టాగదా. ఈసారికి తాకట్టు లేకుండా..." అభ్యర్థించాడు మోహన్.

"తాకట్టు లేని వడ్డీ యాపారం తెడ్డు లేకుండా తెప్పతో అవతలి ఒడ్డుకు చేరుకోవాలనుకోవడం. తాకట్టు లేకుండా అప్పు ఇవ్వడం మా ఇంటా వంటా లేదు" ఖరాఖండిగా చెప్పేశాడు సుబ్బయ్య.

"నా తల తాకట్టు పెట్టుకో" సడన్‌గా ఏదో దొరికి నట్టు, గుర్తుకొచ్చినట్టు చెప్పి, దేబిరించాడు మోహన్.

"నీ తలలో ఏముందయ్యా- సారా సీసాలు, పేకముక్కలు. వెళ్లు, ఏదైనా ఉపయోగపడేది- విలువై నది పట్టకరాపో" అన్నాడు నిర్మోహమాటంగా.

మోహన్ ఇంటిముఖం పట్టాడు. దారి పొడుగునా ఆలోచించాడు. తాకట్టు పెట్టడానికి ఏమైనా మిగి లాయా అని.

ఇంటికొచ్చి పెళ్లానికి ఏదో చెప్పి, తనతో రమ్మ న్నాడు మోహన్. భర్త వెంబడి నడిచింది- మారు మాటాడకుండా నాగమణి- ఆయన అడుగుల్లో అడుగు వేసుకుంటూ.

సుబ్బయ్య ఇంటికి చేరారిద్దరూ.

"సుబ్బయ్యన్నా!" పిలిచాడు మోహన్.

"అదే గొంతు. అదే మనిషి" అనుకుంటూ బయటి కొచ్చాడు సుబ్బయ్య.

మోహన్ భార్య నాగమణిని చూసిన సుబ్బయ్య "అప్పు కోసం భార్యను రెకమెండేషన్ తెచ్చాడేమో"

అనుకొని, "ఇదుగో మోహనూ, నీ భార్యను జూసి జాలి పడి, తాకట్టు లేకుండా అప్పు ఇస్తాననుకున్నావేమో. కుదర్దు. వడ్డీ యాపారం జేసేవోడికి జాలి ఉంటే, జోలె పట్టుకుని ఈదులెంబడి పోవాల్సిందే" తన మనసు విప్పి కుప్పబోశాడు సుబ్బయ్య.

"ఇదుగో తాకట్టు. నూఱ్రూపాయలియ్యి" అన్నాడు మోహన్ చేయి ముందుకు చాపి.

"చేతిలో ఏముందయ్యా. మొండి చెయ్యి. గడియారం, ఉంగరమన్నా లేవు" అన్నాడు సుబ్బయ్య నిరాశగా.

మోహన్ ఎడమ చేతి చూపుడువేలు భార్యవైపు చూపి, "నా పెండ్లాన్ని తాకట్టు పెట్టుకొని, నూఱ్రూపాయలియ్యి."

ఆ మాటలు అణుబాంబులై, నాగమణి తల వేయి వక్కలైనట్లు అయింది. నిలుచున్న నేల నిలువునా చీలి అందులో కూరుకుపోయినట్లయింది. నమ్మలేక పోయింది. ఎన్నో కష్టాల్ని, ఎన్నో బాధల్ని భరించింది. కానీ...

సుబ్బయ్య ఆశ్చర్యపోయినా ఆనందించాడు.

"వడ్డీ లేకుండా ఇస్తాన్లే. మా ఇంటిది వయసు పైబడి పనిచేసుకోలేక సస్తాంది" అని ఒప్పుకొని, జేబులోంచి వంద రూపాయలు లెక్కబెట్టి మోహన్ చేతిలో పెట్టాడు. మోహన్ తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. నెమ్మదిగా తేరుకొని, ఇవన్నీ గమనిస్తోంది నాగమణి. మెల్లగా సుబ్బయ్య వైపు, ఆయన ఇంటివైపు ఒక్కొక్క అడుగే వేయసాగింది ఆమె.

"చూడు సుబ్బయ్యన్నా. పెండ్లామంటే ఇట్లా ఉండాల, మొగుడి మాట జవదాటకుండా" గర్వంగా మోహన్ అంటున్న మాటలు నాగమణి చెవుల్లో శూలాల్లా గుచ్చుకున్నాయి.

❍ ❍ ❍

ఇరవై రోజులు గడిచిపోయాయి. ఒక సాయంత్రం వేళ.

"య్యోవ్, సుబ్బయ్యా? ఏయ్! ఏమే?!" మోహన్ గట్టిగా కేకవేసి పిలిచాడు.

ఆ గొంతు, ఆకారం పరిచయమే, పాతదే సుబ్బయ్యకు, కానీ పిలుపే కొత్తగా ఉంది.

మోహన్ చేతిలో నూరు రూపాయల నోటు రెపరెపలాడుతోంది. ఎన్నో ఏళ్లుగా విన్న గొంతుక కాబట్టి నాగమణి, సుబ్బయ్య ఇంట్లోంచి ఊడుస్తున్న చీపురుతో పాటు బయటికి వచ్చింది. మోహన్‌కు ఎదురుగా, సుబ్బయ్య ప్రక్కనే నిలబడింది.

"ఏమే!" అన్నీ తాకట్టు పెట్టడమే గానీ విడిపించుకోవడంలేద"నే దానివి. ఇప్పుడు జూడు. చివరగా తాకట్టు పెట్టిన నిన్నే మొదటగా విడిపించుకుంటున్నా. పేకాటలో నూఱ్రూపాయలు గెల్చుకున్నా. రాయే, పోదాం" అన్నాడు మోహన్ ధీమాగా, అహంకారంతో, ఎత్తిపొడుపుతో.

"నేను రాను" నెమ్మదిగా, దృఢంగా చెప్పింది నాగమణి.

"నేను ఇక్కడే ఉంటాను" మళ్లీ అంది నాగమణి, రెట్టింపు దృఢత్వంతో.

మోహన్, సుబ్బయ్య బిత్తరపోయి చూశారు.

మోహన్ పళ్లు నూరి, కళ్లెఱ్ఱజేసి, "నువ్వు నా పెండ్లానివే. నీపై సర్వ హక్కులూ నావే. న్యాయంగా, చట్ట ప్రకారం పెద్దల ముందర మన పెళ్లి జరిగింది" ఆవేశ పడుతూ అన్నాడు మోహన్.

"ఏ న్యాయం, చట్టం పెళ్లాన్ని తాకట్టు పెట్టమంది? ఏ పెద్దలు ఇది తప్పని చెప్పి, నన్ను ఆదుకున్నారు?" తీవ్రంగా చూస్తూ అడిగింది నాగమణి.

"పో నాగమణీ" అన్నాడు సుబ్బయ్య.

"భార్య అనే గౌరవం లేకుండా, వస్తువు కింద జమకట్టి, దిగజార్చి నన్ను తాకట్టు పెట్టిన భర్త దగ్గరికి– ఆ మనిషి దగ్గరికి ఎట్లా పోయేది?" ప్రశ్నించింది సుబ్బయ్యను.

ప్రక్కింటి ముసలవ్వ కలుగజేసుకుంటూ, "ఆలు మగల మద్దెన వెయ్యుంటయి, లచ్చుంటయి. మొగుడు తిట్టినా, కొట్టినా, తాకట్టు పెట్టినా పడుండాలే అమ్మా" అంది.

చీపురు కుడి చేతిలోంచి ఎడమ చేతిలోకి మార్చుకుంటూ,"నువు ముందు ఇంట్లోకి ఫో. నీలాంటి ముసలోళ్లు ఎపుడూ ఇట్లానే చెప్పేది" ధీదరించుకుంది నాగమణి.

ఎదురింటి కామాక్షమ్మ "తాకట్టు పెట్టినా విడిపించుకొని, పరాయి ఇంట్లో ఉన్నదాన్ని ఏలుకుంటాను రమ్మంటే పోవేమే? శీరామ సెందురుడు సీతమ్మ వోరిని శీలపరీక్షకు పెట్టినట్లు పెట్టకుండా పిలుస్తాంటే పోవేమే, పొగరా?" దబాయించ బోయింది.

"నేను శీల పరీక్షకు అగ్గిలో దూకే సీతను గాదు. అగ్గిలో దూకితే ఎవరైనా బుగ్గి అయిపోతారు. నేను మామూలు ఆడదాన్ని. నా సంగతి నేను చూసుకుంటాను. నీ పని చూసుకో" నాగమణి అనడంతో, ఆమె నోరు

## వాళ్ళిద్దరూ...

వాళ్ళిద్దరూ... ఏకాంత వేదాంతులై-
ఎత్తైన చెట్టు చివరి కొమ్మపై చిగుళ్ళేరుకుంటూ
వేడి వెలుగుల వాయువుల్ని ఊపిరిగా శ్వాసిస్తూ
ఉడుకులైతే హృదయాల సవ్వడుల తోడుగా
స్నేహ సౌరభ గాన రాగాల గళాలుగ్గబట్టి
సుదూర తీరాలకు విన్పించే విశ్వాసాన్ని
వినయ వలయం చుట్టూ పరిభ్రమించు పార్శ్వమై
ప్రతి క్షణాన్ని గాలంవేసి లాగాలన్న ధీమంతాన
ముఖముఖాన్నొరుసుకుంటూ / ఎదురు కన్నుల
ప్రతిబింబాల్ని వీక్షిస్తూ / సంవాద ప్రారంభ సాయుధ్య
సమఉజ్జీలై / దృశ్య దర్పంతో అనుమానమెరుగని
ఆధిక్యంతో / నాదు నడకలు కాపాడుకునే నేత్రులై-
వేడుకనాడుకుంటూ పాడుకునే పక్షులై-
సాహితీ భక్షకులై, శిక్షకులై / నిర్ణయ నియమాల నిశ్శంక
ప్రమాణాల / వర్ణాంశ యవ్వన ఫలితకేశుల ప్రయాణ
పరీక్షార్థులై - విశేషాంశ అక్షర చోరులై-
తడబాటెరుగని వడి నడకల విడవడలేని / వ్యాపక
ధ్యాన నిమగ్న నిరీక్షణలో / స్థితి స్థాపక శక్తి భక్తులకై
ఎదురు చూసే / మతి మహోదయ ప్రచారయోధులై-
పసిడి కలాల్ని హృదయాలపై హత్తుకుని
నిశిలో వెలుగులై సుస్మిత చక్షోపాఖ్యానాల్ని
సమీక్షించుకుంటున్న అజాత సంరక్షకులై-
మచ్చలెరుగని వలువల దరహాస కాంతుల
ముచ్చట్లాడుకుంటూ ముక్కులెగదోస్తూ
మోహోప్త దీప్తి వ్యాప్తులై, వ్యవహర్తలై-
వసివాడని మల్లెల్లా, కసివీడని ముల్లుల్లా
మహారణావరణాన మనోభిప్రాశ్రిత మూర్తులై
సకలైశ్వర్య సాహిత్య ఋషులై- / వేడుక వేదిక తమ
విశ్వమని, / వేకువ వేగాశ్వ పక్షం తమ తనమని,
ఆర్యావర్తనాన తెలుగక్షరాలు తూర్పారబట్టి
విజ్ఞాన నర్తనాన విధినొడినూర్చే మార్పుకై
సాహితీ సమూహాన్నొడబోసే సాధికారంతో
హృదయ వైశల్యాలింగనాలంకృతులై-
మనోనిశ్చయాభిప్రాయ ప్రాయ మాతృకలై-
మహిమాసపత్రిక ప్రతీక పత్రిక దార్శనిక శక్తులై-
స్వేచ్ఛా భూరుహ స్వప్నావిష్కర్తలై- / స్వీయగాన స్వయం
పరిమళ ప్రశాంతులై / శాంతి భారతి మోమున హారతు
లిడు / అవిశ్రాంతులు; వాళ్ళిద్దరూ... / కురుక్షేత్రంలో
కృష్ణార్జునులా! / సాహితీ క్షేత్రాన నవకేతనమెత్తిన /
అవని సాక్షి ప్రభుభక్తులా! / అనునయాకాంక్ష విభవ
సంస్కర్తలా! / వాళ్ళిద్దరూ...!! హద్దులెరుగని వేనోళ్ళ
పొగడ / సన్నద్ధమయ్యె, సాహిత్య భారతికి / సంప్రదా
యౌన్నత్య ప్రగతి పత్రిక హారతినిడు-
వాళ్ళిద్దరూ... వంశాంశ వారధులు!
వాళ్ళిద్దరూ... సకలాంశ సారథులు!!

-కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు

నొక్కుకుని ఇంట్లోకి దూరింది.

"నట్ట నడీదిలో, పట్టపగలు పెండ్లాన్ని తెగేసి అమ్మిన అరిశ్చెంద్రుడికన్నా, జూదంలో ఆలిని పనంగా ఒడ్డి ఓడిపోయిన దరమరాజు కన్నా, వీడే మారాజు. గొప్పోడే, నీ మొగుడు" సాయంత్రపు ఎండకు నొసటి మీద చేతితో చూపు సవరించుకుంటూ అంది, అందాకా అన్నీ విన్న దారినపోయే దానమ్మ.

తనకు సపోర్టు చేస్తున్నందుకు మనసులోనే అభినందించి, కృతజ్ఞతలు తెలుపుకున్నాడు ఆమెకు మోహన్.

"తానోడి నన్నోడెనా? నన్నోడి తానోడెనా?" అని కూడా ద్రౌపదిలా అడక్కుండా, తాకట్టుకు నా ఇంట్లోకి వచ్చిన నాగమణే గొప్పది" అన్నాడు సుబ్బయ్య.

"నేను చంద్రమతిని కాదు, ద్రౌపదిని కాదు. మామూలు మనిషిని. అందరు ఆడవాళ్లలా భర్తతో కలిసి కాపురం చేయాలనుకున్నా, కమ్మని కలలు కన్నదాన్నే. కానీ మీరంతా ఇట్లా మాట్లాడబట్టే, ఉండబట్టే, మగవాడు రెచ్చిపోతున్నాడు. దురహంకారంతో రాజులే పోయినారు. మగ మహారాజు లెక్కడ్నుంచి వచ్చినారు? మగవాడికి కనువిప్పు కలగాలనే ఈ నా నిర్ణయం" ముగ్గురి వైపు తీక్షణంగా చూస్తూ అంది నాగమణి.

దారినపోయే దానమ్మ నొసటి మీద నుంచి చేయి తీసి, చేతి కర్ర టకటకలాడించుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయింది.

"అయిందేదో అయిపోయింది. పోదాం రాయే" కొంచెం తగ్గి అన్నాడు మోహన్.

"మళ్లీ తాకట్టు పెట్టవని నమ్మకమేంటి? ఇక్కడుంటే సుబ్బయ్యన్న నన్ను తోడబుట్టిన దాన్లా చూసుకుంటున్నాడు, ఎప్పటికీ, ఎవ్వరికీ తాకట్టు పెట్టడు. నాకిక్కడే హాయిగా ఉంది. నేను రాను" అని చేతిలోని పొరక వీధిలోకి పారేసి, సుబ్బయ్య ఇంట్లోకి గబగబ అడుగులు వేసింది నాగమణి.

సుబ్బయ్య స్థాణువులా నిలబడిపోయాడు.

మోహన్‌లోని శక్తినంతా భూదేవి లాగేసినట్లు తల తిరిగి, తూలి కింద పడబోయాడు. పట్టుదప్పి, చేతిలోని వంద రూపాయల కాగితం గాలికి ఎగిరిపోయింది. అడుగులు కదిలాయి. నడుస్తున్న శవమయ్యాడు. ఇంటివైపుకు కాకుండా, ఊరికి ఉత్తరం వైపు నడక సాగించాడు. ఆ వైపు ఉన్నది స్మశానం!

సాయం సంధ్య.

సూర్యుడు పశ్చిమాద్రికి దూకి, ఆత్మహత్య చేసుకున్నాడు- మళ్లీ కొత్తగా పునర్జన్మ నెత్తడానికి! ■